క్లుప్తంగా

జిల్లా జైలులో పరిశీలన



రికార్డు పరిశీలిస్తున్న జడ్జి చంద్రశేఖరరావు

ఖమ్మం లీగల్: ఖమ్మం రూరల్ మండలంలోని జిల్లా జైలును న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి చంద్రశేఖరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలతో మాట్లాడి వారి హక్కులు, ఇతర అంశాలపై అవగాహన కల్పించడమే కాక సదుపాయాలపై ఆరాతీశారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. జైలు ఉద్యోగులు, డిఫెన్స్ కౌన్సిల్ హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి పర్యటన

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం పర్యటించారు. ఆచార్లగూడెం, బోదులబండ గ్రామాలకు చెందిన నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

తిరుమలాయపాలెం: మండలంలోని కేశ్వాపురం గ్రామానికి చెందిన ఉన్నం భారతమ్మ దశ దిన కార్యక్రమం సందర్భంగా గురువారం పలు పార్టీల నేతలు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు వీరభద్రం, కొండబాల కరుణాకర్, ఉన్నం రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐలు



సీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఐలు

ఖమ్మంక్రైం: ఇటీవల బదిలీ అయిన తాటిపాముల కిరుణాకర్ ఖమ్మం వన్‌టౌన్ సీఐగా, మోహన్‌బాబు త్రీటౌన్ సీఐగా గురువారం బాధ్యతలు చేపట్టారు. 2009 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన కరుణాకర్ గతంలో కూసుమంచి, ముదిగొండ, ఖమ్మం వన్‌టౌన్‌లో ఎస్ఐగా, సత్తుపల్లి, అశ్వారావుపేట, ఏడూళ్లబయ్యారం సీఐగా పనిచేశారు. అలాగే 2009 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన మోహన్‌బాబు వరంగల్, కరీంనగర్ జిల్లాలో ఎస్ఐగా, సత్తుపల్లి, ఖమ్మం ట్రాఫిక్ సీఐగా పనిచేశారు. అదే విధంగా ఖమ్మం టాస్క్‌ఫోర్స్ సీఐగా దోమల రమేష్, సీసీఎస్ సీఐగా ఉదయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

వైభవంగా హరిహర మహా క్షేత్రం శంకుస్థాపన



దేవాలయ విశిష్టతను వివరిస్తున్న శ్రీ చందకాళీ ప్రసాద్ మాతాజీ

కామేపల్లి: కామేపల్లిలో శ్రీ గురు హరిహర మహా క్షేత్రం శంకుస్థాపన కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరిగింది. కాళీవనాశ్రమ పీఠాధిపతులు శ్రీ చంద్రకాళీ ప్రసాద్ మాతాజీ సమక్షంలో వేదపండితులు బలగం భార్గవశర్మ బృందం ఆధ్వర్యాన వేద మంత్రోచ్చరణల మధ్య వేలాది మంది భక్తుల ఓంకార నామం నడుమ ఆలయ కమిటీ అధ్యక్షుడు గొట్టుపర్తి శివాజీ దంపతుల చేతుల మీదుగా శంకుస్థాపన మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. తెల్లవారుజామునే ఆలయ ప్రాంగణంలో భక్తులతో మండపారాధన, గణపతిపూజ, వాస్తు పూజ, హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హిందుధర్మం గొప్పతనంతో పాటు గ్రామంలో ఆలయ నిర్మాణంతో జరిగే ఫలితాలను ప్రసాద్ గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాగఫణిశర్మ, సాయి రామకృష్ణ, నరసింహశర్మ, మహంకాళీ రామనర్సయ్యగుప్తా, దమ్మాలపాటి శివాజీ, శేషారావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	హిట్: ది థర్డ్ కేస్
వినోద	సింగిల్, రెట్రో, జింఖానా
సాయిరాం	జగదేకవీరుడు అతిలోక సుందరి, తండర్‌బోల్ట్స్
ఆదిత్య	శుభం, జింఖానా, అర్జున్ సన్ఆఫ్ వైజయంతి
శ్రీనివాస	దేశముదురు, తుడారమ్

- ఖమ్మంగాంధీచౌక్






వ్యవసాయాన్ని ప్రతిబింబించేలా..

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ యార్డుల చుట్టూ ఉన్న ప్రహరీలపై కళాకారులు వేసిన చిత్రాలు రైతుల శ్రమ, సాగు పనులకు అద్దం పడుతున్నట్లుగా ఉన్నాయి. రైతు, కూలీల శ్రమ జీవనం, పంటల సాగు వాటి విక్రయాలు మార్కెట్‌లో విక్రయంతో దక్కే మద్దతు ధరలు తదితర అంశాలను ప్రతిబింబిస్తూ చిత్రాలను తీర్చిదిద్దారు. ఖమ్మం నగరపాలక సంస్థ వాల్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా రైతులకు ప్రయోజనం కలిగేలా వేసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి.

– ఖమ్మంవ్యవసాయం

చౌరస్తా.. జర జాగ్రత్త!

పెరిగిన రద్దీతో కూడళ్ల వద్ద గందరగోళంగా ట్రాఫిక్

- సిగ్నల్స్ పాటించని వాహనదారులు
- ప్రమాదాల బారిన పడుతున్న వైనం
- డేంజర్‌గా శ్రీశ్రీ, ఎన్టీఆర్ సర్కిళ్లు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని చౌరస్తాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. నగర విస్తరణతో పాటు ట్రాఫిక్ రద్దీ కూడా అదే రీతిలో పెరుగుతుండడంతో పలు సందర్భాల్లో కూడళ్ల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సిగ్నళ్లను లెక్కచేయకుండా కొందరు వాహనదారులు వెళ్తుండడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాపాయ పరిస్థితి వస్తోంది. ముఖ్యంగా బైపాస్‌లోని ప్రధానమైన ఎన్టీఆర్ సర్కిల్, శ్రీశ్రీ సర్కిల్ వద్ద ఈ పరిస్థితి నెలకొంటుంది. కూడళ్ల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా అధికారులు దృష్టి సారించాల్సి అవసరం ఉంది.

సిగ్నల్ పడేలోగా..

నగరంలోని ప్రధాన కూడళ్లయిన ఎన్టీఆర్ సర్కిల్, ఇల్లెందు క్రాస్‌రోడ్, జెడ్పీ సెంటర్, చర్చి కాంపౌండ్, పాత బస్టాండ్ వద్ద ట్రాఫిక్ పోలీసులు సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ఆయా సెంటర్ల మీదుగా ప్రయాణించే వాహనదారులు కొందరు సిగ్నల్స్ పడినా పట్టించుకోకుండా వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. పెరుగుతున్న రద్దీ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఓ పక్క పెరిగిన రద్దీ కారణమైతే మరోపక్క వాహనదారుల ఆతృత ప్రమాదాలకు కారణమవుతోంది.

➡ శ్రీశ్రీ సర్కిల్..



నగర శివారులో మరో ప్రధాన కూడలిగా ఉన్న శ్రీశ్రీ సర్కిల్ ప్రాంతం కూడా వాహనదారులతో రద్దీగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, భద్రాద్రికొత్తగూడెం, వరంగల్, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదొక మార్గం కావడంతో బస్‌లు, భారీ వాహనాలు ప్రతినిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఈ సర్కిల్ కొంత గందరగోళంగా ఉంటుంది. ఇక్కడ నగరం నుంచి వచ్చే వాహనాలు హైవే మీదకు వెళ్లే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనదారులతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆదమరిస్తే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఇక్కడ సిగ్నల్ వ్యవస్థ కూడా లేకపోవడం, హైవేపై డివైడర్లు ఎత్తుగా కట్టడంతో ఎదురుగా వచ్చే వాహనాలను అంచనా వేయడంలో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు.

సాక్షి ఫోకస్

➡ ఇల్లెందు క్రాస్‌రోడ్



ఇల్లెందు క్రాస్ రోడ్ కూడలి మూడు మార్గాలను కలుపుతుంది. ఇందులో పాత బస్టాండ్ నుంచి జెడ్పీ సెంటర్‌మీదుగా వచ్చే మార్గం, ఎన్టీఆర్ సర్కిల్ నుంచి వచ్చే మార్గం, వైరా నుంచి శ్రీశ్రీ సర్కిల్ మీదుగా వచ్చే మార్గాలు ఉండగా.. బస్‌లతో పాటు కార్లు, ద్విచక్ర వాహనదారులతో అధిక రద్దీ ఉంటోంది. పైగా ఈ ప్రాంతంలో ఆర్టీసీ బస్‌లు, ఆటోలను ఆపుతుంటారు. సిగ్నల్ వ్యవస్థను ఈ కూడలి వద్ద ఏర్పాటు చేశారు. వాహనాల రద్దీ ఉన్న సమయాన సిగ్నల్స్‌ను క్రాస్ చేసేందుకు వాహనదారులు వేగంగా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు.

➡ ఎన్టీఆర్ సర్కిల్..



నాలుగు రోడ్లను కలుపుతూ నగరంలో ప్రధాన కూడలిగా ఉన్న ఎన్టీఆర్ సర్కిల్ నుంచి వరంగల్, ఇల్లెందు, భద్రాచలం వెళ్లే ప్రధాన మార్గాలున్నాయి. ఆయా మార్గాల నుంచే వచ్చే వాహనాలే కాకుండా నగరంలోకి వెళ్లి వచ్చే వాహనాలు సైతం తోడవడంతో ట్రాఫిక్ విపరీతంగా పెరుగుతుంటుంది. దీనికి అదనుగా కొత్త బస్టాండ్‌కు వెళ్లే మార్గం కూడా ఇదే అయింది. ఈ క్రమంలో సర్కిల్ వద్ద సిగ్నళ్లు వెంట వెంటనే పడుతుంటాయి. రెండు నిముషాల పాటు రెడ్ సిగ్నల్ పడితే.. 30 సెకండ్ల పాటు మాత్రమే గ్రీన్ సిగ్నల్ ఉంటోంది. దీంతో సమయం సరిపోక సగం వాహనాలు మాత్రమే చౌరస్తాను దాటుతుండగా.. మిగిలినవి అలాగే ఆగాల్సి వస్తుంది. ఈక్రమంలో కొందరు మరో సిగ్నల్ పడేలోగా వెళ్లాలనే ఆతృతతో సిగ్నళ్లను పట్టించుకోకుండా వేగంగా వెళ్తున్నారు.

ఆరోగ్య శాఖ మంత్రికి వినతులు



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఐఎన్‌జీయూసీ నేతలు



వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఖమ్మంవైద్యవిభాగం: ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై గురువారం పెద్దాస్పత్రిలో తెలంగాణ వైద్య, ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం (ఐఎన్‌జీయూసీ) ఆధ్వర్యాన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సందీప్ మాట్లాడుతూ.. ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి కార్పొరేషన్ వ్యవస్థ ద్వారా ఉద్యోగులకు జీతాలు, జీవిత బీమాతో పాటు ఆరోగ్య బీమా రక్షణ చట్టాలు కల్పించాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసీ ఆఫీసర్, నర్సింగ్ ఆఫీసర్ తదితర పరీక్షా ఫలితాలు విడుదల చేసి పోస్టింగులు ఇవ్వాలని పేర్కొన్నారు. నిర్మల్ జిల్లాలో కాంట్రాక్టు ఉద్యోగి విధులు నిర్వహిస్తూ ఆత్మహత్యకు పాల్పడిన వి.భరత్‌కుమార్ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. ఆశా కార్యకర్తలకు రూ. 20 వేలు నికర వేతనంతో పాటు ప్రభుత్వ ఖర్చుతో లైఫ్ ఇన్సూరెన్స్, కుటుంబాలకు రక్షణ చట్టాలు ఏర్పాటు చేయాలని మంత్రికి విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వి.కృష్ణారావు, సభ్యులు రామకృష్ణ, మోబిన్, కవిత, వీరన్న, పాషా, నికత్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి..

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యాన మంత్రి రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్, టీయూసీఐ జిల్లా కార్యదర్శి జి.రామయ్యలు మాట్లాడుతూ.. జీతాలు సకాలంలో అందక సెలవు పెట్టుకొని కూలి పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం జోక్యం చేసుకొని సమస్యను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటరమణ, రాములమ్మ, అంబేద్కర్, ఉపేందర్, జగదీష్, రాధా, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం..

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం నియోజకవర్గంలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల శంకుస్థాపనకు గురువారం ఖమ్మం విచ్చేసిన మంత్రి రాజనరసింహను హెలీప్యాడ్ వద్ద తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. వివిధ సంఘాల బాధ్యులు డేవిడ్‌రాజ్, వెంకటేశ్వర్లు, ఇంతియాజ్, వెంకయ్య, వంశీ, గురవయ్య, వెంకన్న, సురేష్, రవీందర్ పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జికి సన్మానం



చరణ్‌తేజ్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్: ఖమ్మానికి చెందిన కోటి చరణ్‌తేజ్ ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన సందర్భంగా గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తొండపు వెంకటేశ్వరరావు, గద్దల దిలీప్‌కుమార్ ఆధ్వర్యాన అసోసియేషన్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ.. ఆయన భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించగా.. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానన్నారు. ఈ కార్యక్రమంలో విజయకాంతి, ఇందిర, లక్ష్మి, కొల్లి సత్యనారాయణ, మందడపు శ్రీనివాసరావు, బాబ్జి, వై.శ్రీనివాస్, జహీర్‌అలి, కర్లపూడి శ్రీనివాస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడికి..

ఖమ్మం మామిళ్లగూడెం: యువత దేశభక్తిని పెంపొందించుకుంటూ సేవాభావంతో ముందుకు సాగాలని యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణు పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మం వచ్చిన ఆయన్ను యువజన సంఘాల సమితి జిల్లా నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడగా.. కార్యక్రమంలో యువజన సంఘాల సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి జక్కుల వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు కోడిరెక్క ఉమశంకర్, నాయకులు భూక్యా హరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘రెడ్ క్రాస్’ సేవలు విస్తరింపజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమోహన్

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లా వ్యాప్తంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు విస్తరింపజేయనున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ తెలిపారు. గురువారం ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవ వేడుకలను జిల్లా సీనియర్ సిటిజన్స్ కార్యాలయం, మహాత్మా గాంధీ డే కేర్ సెంటర్‌లో నిర్వహించగా.. ఫాదర్ ఆఫ్ రెడ్‌క్రాస్ జాన్ హెంద్రీ డునాట్ చిత్రపటానికి రాయల వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చంద్రమోహన్ మాట్లాడుతూ.. రెడ్ క్రాస్ సమాజానికి అందిస్తున్న విశిష్ట సేవలను సభ్యులకు వివరించారు. సభ్యుడు తాత రాఘవయ్య రెడ్‌క్రాస్ సంస్థ పుట్టుక, దాని విధులను తెలియజేశారు. డాక్టర్ కూరపాటి ప్రదీప్ తలసేమియా గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు, సాధినేని జనార్ధన్‌రావు, నరసయ్య, సుబ్బయ్య, రవేంద్రనాథ్, గోవర్ధన్‌రావు, శ్రీహరి, ముజీబ్, అనాసి రాధాకృష్ణ, ఎస్.వెంకటేశ్వర్లు, టి.వెంకటేశ్వర్లు, రమేష్, జల్లా వెంకటేశ్వర్లు, కుటుంబరావు, పుల్లారావు, రచ్చ రామారావు తదితరులు పాల్గొన్నారు.

16న కార్పొరేషన్ కార్యాలయ ముట్టడి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని స్థానిక సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 16న కేఎంసీ కార్యాలయాన్నిముట్టడించనున్నట్లు సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అన్నారు. గురువారం సీపీఎం రఘునాథపాలెం మండల కమిటీ సమావేశం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించగా ఆయన మాట్లాడారు. నగర పరిధిలోని సమస్యలపై సీపీఎం ఆధ్వర్యాన ఇంటింటి సర్వే చేపడుతుండగా.. పలువురు పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు తదితర సమస్యలను లేవనెత్తుతున్నట్లు పేర్కొన్నారు. వీరి సమస్యల పరిష్కారం కోసం 16న నిర్వహించే ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు జి.కుమార్, కూచిపూడి నరేష్, వల్లూరు శ్రీనివాసరావు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, కనగంటి తిరపయ్య, షేక్ ఇమామ్, షేక్ షరీఫ్, మంగమ్మ, హరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం విజయవంతం



మాట్లాడుతున్న అదనపు జిల్లా న్యాయమూర్తి ఉమాదేవి

ఖమ్మం లీగల్: క్రికెటర్ యువరాజ్ సింగ్ ఫౌండేషన్ యూ వీ కెన్, స్వస్థ్ మహిళా, స్వస్థ్ భారత్ ఆధ్వర్యాన గురువారం న్యాయ సేవాధికార సంస్థ ఆవరణలో న్యాయమూర్తులు, న్యాయశాఖ ఉద్యోగులకు నిర్వహించిన ఉచిత బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ అవగాహన కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా అదనపు జిల్లా న్యాయమూర్తి ఉమాదేవి మాట్లాడుతూ.. ఫౌండేషన్ ఆధ్వర్యాన స్క్రీనింగ్ టెస్ట్‌లు, అవగాహన తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా మహిళలకు రేడియేషన్ లేకుండా త్వరితగతిన, తక్షణ పరీక్షలు, గోప్యతతో నిర్వహించడం అభినందనీయమని, కేన్సర్ ప్రారంభ సంకేతాలు లక్షణాలు ఎలా ఉంటాయనేది తెలుసుకోవడం ద్వారా మహిళలు స్వీయ పరీక్ష పద్ధతులను పాటించి అవగాహన కలిగి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు అపర్ణ, కల్పన, శివరంజని, దీప, రజని, బిందుప్రియ, చంద్రశేఖరరావు, ఫౌండేషన్ బాధ్యులు షహనాజ్ భాను, సత్యవతి, విద్య శ్రీ, న్యాయ సేవ ఉద్యోగుల సంఘం బాధ్యులు శ్రీనివాసరాజు శ్రీనివాసరెడ్డి, ఓంకార్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్ నిర్మూలనలో వైద్యుల పాత్ర కీలకం

ఖమ్మం మామిళ్లగూడెం: కోవిడ్ వైరస్ వ్యాప్తి నిర్మూలనలో గ్రామీణ వైద్యుల పాత్ర కీలకమని రాజ్యాంగ పరిరక్షణ వేదిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సాధిక్‌అలీ అన్నారు. గురువారం ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రామీణ మైనార్టీ వైద్యుల సంఘం సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సురక్ష ఆస్పత్రి అధినేత డాక్టర్ బాల భాస్కర్‌రెడ్డి సాధిక్‌ను సత్కరించారు. ఈ సమావేశంలో సంఘం నేతలు షేక్ హసన్, షేక్ జానీమియా, నజీరుద్దీన్, బాబుమియా, ఖాసిం, చాంద్ పాషా, ఆషా తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పోతినేని

ఖమ్మం మామిళ్లగూడెం: అకాల వర్షాలు, అధికారులు నిర్లిప్తత మూలంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర అగచాట్లు పడుతున్నారని, తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో వ్యయ ప్రయాస కోర్చి అన్నదాతలు పండించిన పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయకుండా తీవ్ర జాప్యం చేస్తుండడంతో ఇదే అదనుగా ధాన్యాన్ని తక్కువ రేటుకు కొంటూ దళారులు దగా చేస్తున్నారని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో తగినన్ని గన్నీ బ్యాగులు లేక సమయానికి లారీలు రాక కాంటాలు జరగకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ధాన్యం కొనుగోలు మిల్లర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి జరుగుతోందని, మిల్లర్లు, ప్రభుత్వం మధ్య ఉన్న సమస్యలలో రైతులను బలి చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాచర్ల భారతి, బొంతు రాంబాబు, వై.విక్రమ్, భూక్యా వీరభద్రం, మాదినేని రమేష్, ఎర్రా శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

ఉగ్రస్థావరాలపై దాడి దేశానికే గర్వకారణం



సంఘీభావం ప్రకటిస్తున్న నాయకులు

ఖమ్మం వన్‌టౌన్: ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రస్థావరాలపై దాడి చేసి భారత సైన్యం చూపిన ధైర్యం దేశానికే గర్వకారణం అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. టీపీసీసీ ఆదేశానుసారం గురువారం నగరంలో భారత్ ఆర్మీకి మద్దతుగా సంజీవరెడ్డి భవనం నుంచి అమరవీరుల స్తూపం వరకు శాంతియుత సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పహల్గామ్ దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ ఉగ్రమూకలపై భారత సైన్యం నిర్వహించిన నిర్దేశిత దాడులు యావత్తు దేశ ప్రజలు గర్వపడేలా చేశాయని అన్నారు. ఇలాంటి సమయంలో ప్రతీ భారతీయుడు భారత సైన్యానికి అండగా నిలబడాలన్నారు. జై హింద్.. జై భరత్ అంటూ నినాదాలు తీశారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారముక్తార్, చోటా బాబా, ఎన్.వెంకటేశ్వర్లు, సాధు రమేష్‌రెడ్డి, పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, వేజెండ్ల సాయికుమార్, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్‌గౌడ్, ఎస్.ముజాహిద్ హుస్సేన్, గజ్జెల్లి వెంకన్న, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, కన్నం వైష్ణవిప్రసన్నకృష్ణ, కమర్తపు మురళి, రావూరి సైదుబాబు, గజ్జల లక్ష్మీవెంకన్న, కొప్పెర సరిత ఉపేందర్, పల్లెబోయిన భారతీచంద్రం తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లిలో మానవహారం..



మానవహారం నిర్వహిస్తున్న నాయకులు

కామేపల్లి: పాకిస్తాన్‌లో దాగివున్న ఉగ్రవాదులను మట్టుపెట్టిన భారత త్రివిధ దళాలకు మద్దతుగా కామేపల్లిలో యువకులు, ఉద్యోగులు, వివిధ పార్టీల నాయకులు మానవహారం నిర్వహించారు.